క్లుప్తంగా

నేటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

రాయవరం: మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం నుంచి ఆరు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణ మూర్తి సోమవారం తెలిపారు. మండలంలోని 70 అంగన్‌వాడీ కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణలో పాల్గొనే అంగన్‌వాడీ కార్యకర్తలకు, రీసోర్స్ పర్సన్లకు లంచ్ ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దివ్యాంగులతో ఆప్యాయంగా ఉండాలి



కాజులూరు భవిత సెంటరును పరిశీలిస్తున్న ఐఈ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వర్రావు

కాజులూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులపై ఆప్యాయంగా ఉండాలని ఐఈ కో ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వర్రావు అన్నారు. సోమవారం కాజులూరు భవిత సెంటరును ఐఈ కో ఆర్డినేటర్, సీఎంఓ చామంతి నాగేశ్వర్రావు సందర్శించి దివ్యాంగ విద్యార్థులకు అందిస్తున్న ప్రత్యేక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాటలు రాని దివ్యాంగులకు స్పీచ్‌థెరపీ మిషన్ ద్వారా మాటలు నేర్పించు విధానాన్ని పరిశీలించి భవిత సెంటరుకు దానిని బహూకరించిన దాతలకు అభినందనలు వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ మెయిన్ పాఠశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: నల్లూరులో నూతనంగా నిర్మించిన భక్తాంజనేయస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పండితులు ప్రత్యేక పూజలు చేసి ఆంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి శిలా విగ్రహాలను ప్రతిష్ఠించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదానం నిర్వహించారు. కాలేరు, వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, టేకి గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వాహనాల తనిఖీ



గొల్లపాలెంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై, స్టేషన్ సిబ్బంది

కాజులూరు: వాహనదారులు రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ అన్నారు. సోమవారం కాకినాడ, కోటిపల్లి రహదారిపై సాయిబాబా మందిర వద్ద ఎస్సై మోహన్‌కుమార్, స్టేషన్ సిబ్బంది వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణపై లారీలు, ట్యాక్సీలు, కార్లు, మోటారుసైకిళ్ల తదితర వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల తలెత్తే ప్రమాదాలపై ప్రయాణికులకు పలు సూచనలు చేసారు. పలిస్టేషన్ సిబ్బంది శేఖర్, శివ, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

23న న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభ

రామచంద్రపురం: ఈనెల 23న విజయవాడలో జరిగే రెండు న్యూ డెమొక్రసీ పార్టీల విలీన సభను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.వెంకటేశ్వర్లు సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జె.సత్తిబాబులు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సభకు చెందిన పోస్టర్‌ను పట్టణంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం ఆవిష్కరించి మాట్లాడుతూ 2013లో రెండుగా చీలిన న్యూ డెమోక్రసీ పార్టీ ఉద్యమాన్ని నష్టపోయిందన్నారు. ఈ రెండు న్యూ డెమొక్రసీ పార్టీలు ఇప్పటికే కేంద్ర నాయకత్వంతో చర్చలు జరిపి విలీనం చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఈ రెండు పార్టీలు విలీన సభ ఈనెల 23 ఉదయం పది గంటలకు విజయవాడలోని ఎంబీ భవన్ ఆడిటోరియం రాఘవయ్య పార్క్‌లో జరుగుతుందన్నారు. ఈ సభకు సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వై సాంబశివరావు సాధినేని వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ పార్టీ అధికార ప్రతినిధులు పీ ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జేవీ చలపతిరావు తదితరులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు ఎం.ఏసు, గుబ్బల ఆదినారాయణ, పంచాయతీ జిల్లా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఆర్.రఘువులు, డివిజన్ నాయకులు మల్లవరపు రాజు, ప్రగతిశీల విభజన సంఘం జిల్లా అధ్యక్షులు బాలరామ్ తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవికి ఆసరా ఈ-శ్రమ్

- అసంఘటిత రంగ కార్మికులకు గుర్తింపు
- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహణ
- శ్రామికుల ఆర్థిక, సామాజిక భద్రతకు దోహదం
- లేబర్ కార్యాలయం, సచివాలయాల్లో నమోదు



కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపులో శ్రమిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

కపిలేశ్వరపురం: శ్రమ జీవులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. కార్మికుల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుంది. ముందస్తుగా శ్రమజీవులకు ప్రత్యేక గుర్తింపు కార్డులను జారీ చేసేందుకు సన్నద్ధమైంది. దీనిలో భాగంగా ఈ-శ్రమ్ పథకంలో శ్రమజీవులు చేర్పించేందుకు కార్మికశాఖ, అనుబంధ శాఖల అధికారులు, సిబ్బంది కొద్ది రోజులుగా ప్రత్యేక కార్యాచరణలో ఉన్నారు.

రెండు నియోజకవర్గాల్లో శ్రామిక శక్తి ఇలా...

మండపేట నియోజకవర్గంలో 43 గ్రామాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో 77 గ్రామాలు వెరసి మొత్తం 120 గ్రామాల్లో పంచాయతీ కార్మికులు రోజువారీ శ్రమ చేస్తున్నారు. కపిలేశ్వరపురం, కె.గంగవరం మండలాల్లోని లంక గ్రామాల్లో ఎకరాల కొబ్బరి ఒలుపు కార్మికులున్నారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో వందలాది మంది అంగన్‌వాడీలు ఉన్నారు. కపిలేశ్వరపురం, మండపేట పట్టణం, కె.గంగవరం మండలాల్లో విస్తారంగా మత్యకార్మికులున్నారు. మండపేట పరిసర గ్రామాల్లో 120పైగా రైస్‌మిల్లులు, రెండు పేపర్ మిల్లులు, మూడు ఆయిల్ ఫ్యాక్టరీల్లో వందల మంది కార్మికులు పనిస్తున్నారు. మండపేట నియోజకవర్గంలో సుమారు 300 ఇటుక బట్టీల్లో 3 వేల మంది వలస కార్మికులున్నారు. రామచంద్రపురం, మండపేట, కపిలేశ్వరపురం ప్రాంతాల్లో విస్తారంగా భవన నిర్మాణ కార్మికులు పని చేస్తున్నారు.

నమోదు చేసుకుంటే భద్రత

పెద్ద వ్యాపారులు వ్యాపార సంస్థను ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకుని తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటాయి. వాటికి గుర్తింపు, రుణ సాయం తదితర సదుపాయాలు ఉంటాయి. వలస, అసంఘటిత, రంగ కార్మికులకు, చిరు వ్యాపారులకు అటువంటివి దక్కవు. వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది. ఆయా విభాగాల్లోని శ్రామికులు ఈ- శ్రమ్ పోర్టల్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం



ఈ-శ్రమ్ నమోదు ప్రాధాన్యతను తెలుపేందుకు పని ప్రదేశాలకు వెళ్లి కార్మికులకు అవగాహన కల్పిస్తున్నాం. రెండు నియోజకవర్గాల పరిధిలో మండపేట, రాయవరం, రామచంద్రపురంలో సహాయ కార్మికాధికారి కార్యాలయాలున్నాయి. వాటితో పాటు సీఎస్‌సీ, గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా వివరాలను నమోదు చేసుకోవచ్చు.

కాశి శివనాగమల్లేశ్వరరావు, సహాయ కార్మికాధికారి, మండపేట

ఈ పథకానికి అర్హులు వీరే...

16 నుంచి 59 సంవత్సరాలు వయసు కలిగిన నిర్మాణ వర్కర్స్, వలస కార్మికులు, ఇంటి పని వారు, వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, కౌలు రైతులు, మత్స్యకారులు, పశుపోషకులు, తోలు కార్మికులు, వడ్రంగి, ఉప్పు కార్మికులు, ఇటుక బట్టీ కార్మికులు, వీధి వ్యాపారులు, ఆటో, రిక్షా కార్మికులు, ఆశ, అంగన్వాడీ వర్కర్లు, షాపుల్లో పనిచేసే సిబ్బంది, ఈఎస్ఐ, పీఎఫ్ పొందే అర్హత లేనివారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు.

ప్రయోజనాలిలా...

విపత్తుల కాలంలో శ్రామికులను ఆదుకునే దిశగా ఈ పథకాన్ని రూపొందించారు. ఈ పథకంలో ఒక్కసారి నమోదు అయితే సరిపోతుంది. రెన్యువల్ చేయించనవసరం లేకుండా జీవితాంతం వివరాలు వెబ్‌సైట్లో ఉంటాయి. వృత్తి నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను పొందేందుకు ఈ కార్డు ఉపకరిస్తుంది. అసంఘటిత కార్మికులు సామాజిక భద్రత చట్టం కింద ప్రయోజనాలు పొందేందుకు ఈ నమోదు అవసరం. సంస్థల్లో పనిచేసేవారికి సంస్థ ద్వారా గుర్తింపుతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వంటి సదుపాయాలు లభిస్తాయి. కానీ అసంఘటితంగా ఉన్న కార్మికులకు ఎలాంటి గుర్తింపు, సదుపాయాలు లేవు. ఈ విషయమై ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలనిచ్చింది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రాల్లో అసంఘటితంగా ఉన్న కార్మికులందరినీ గుర్తించి గుర్తింపు కార్డు జారీ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. దీంతో కార్మిక కుటుంబానికి సామాజిక భద్రత కలుగుతుంది. కార్డు కలిగిన వారికి రూ.2 లక్షలు ప్రమాద బీమా, పనిలో ఉండగా అంగవైకల్యం కలిగితే రూ.1 లక్ష ఆర్థిక సాయమందిస్తారు.

నమోదు ఇలా...

కార్మికులు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకొనేందుకు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదు. ఉచితంగా వివరాలను నమోదు చేసి యూనివర్సిల్ అకౌంట్ నంబర్ (యూఎన్‌)గుర్తింపు కార్డును సైతం జారీ చేస్తారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయం, సీఎస్‌సీ సెంటర్, మండపేటలోని లేబర్ ఆఫీసర్ కార్యాలయంలలో ఈ-శ్రమ్‌లో వివరాలను నమోదు చేస్తారు. కార్మికుడు తన ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్టు సైజ్ ఫొటోను తీసుకెళ్లాలి. నామినీ ఆధార్, బ్యాంక్ ఖాతాల జెరాక్స్ కాపీలను కూడా ఇవ్వాలి. కార్మికుడు ఎవరి దగ్గర పనిచేస్తున్నాడో వెల్లడి చేయాల్సిన అవసరం లేదు. ఏ వృత్తి చేస్తున్నాడో చెబితే సరిపోతుంది. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం లేని, ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలో లేని కార్మికులు నమోదు చేసుకోవచ్చు. కోటి రూపాయిల లోపు టర్నోవర్ ఉన్న చిరువ్యాపారులు నమోదు చేసుకోవచ్చు.

పోలీస్ స్టేషన్‌లో మహిళా హెల్ప్ డెస్క్ ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ రఘువీర్

మండపేట: మహిళలకు ఏ విధమైన ఇబ్బంది కలిగినా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ సమస్యను చెప్పుకోవచ్చని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ అన్నారు. టౌన్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్‌లో దాతల సహకారంతో ఆధునీకరించిన సీఐ రూమ్, మహిళా హెల్ప్ డెస్క్‌లను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రఘువీర్ మాట్లాడుతూ మహిళల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామన్నారు. మహిళల భద్రత కోసం ఈ హెల్ప్ డెస్క్‌లు పనిచేస్తాయన్నారు. పోలీసులు ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగి వారి సమస్యలను పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సీఐ పి.దొరరాజు, టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి, కానిస్టేబుళ్లు రాము, నాగేంద్ర, ఉమెన్ కానిస్టేబుల్ దుర్గ, రైటర్ జి.నరసింహారావు, హెడ్ కానిస్టేబుల్ కాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠకు పూజలు

కె.గంగవరం: మండలంలోని కోట ప్రధాన రహదారిపై ఈ నెల 23న న ధాన్యలక్ష్మీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ఎంపీపీ పంపన నాగమణి, సుబ్బారావు దంపతులు పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం 23న విగ్రహ ప్రతిష్ఠ జరుపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వీరభద్రుని సంబరంలో మంత్రి సుభాష్

కె.గంగవరం: సత్యవాడలో సోమవారం నిర్వహించిన వీరభద్రుడి సంబరంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం



రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సూర్యప్రకాష్

మండపేట/రామచంద్రపురం: క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పిల్లి సూర్యప్రకాష్, మండపేట నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన చోడే శ్రీకృష్ణ సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, డాక్టర్స్ సెల్ జిల్లా కన్వీనర్ డాక్టర్ చోడే సత్యకృష్ణలతో కలిసి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్, శ్రీకృష్ణకు రాజా అభినందనలు తెలిపారు. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచకాలు, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదల, మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి తదితది హామీలను గాలికొదిలేసి యువతను మోసగించిన తీరును ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మాజీ ఎంపీపీ వాసంశెట్టి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి నేతల తీరుతో స్తంభించిన పంచాయతీ పాలన

ఆగిన తాత్కాలిక సర్పంచ్ ఎంపిక



కోరం సరిపోలేదని చెప్పి వెళ్లిపోతున్న అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేట పంచాయతీ గ్రామ సర్పంచ్ కోరపు కామరాజు గత ఏడాది డిసెంబరు 27వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. సర్పంచ్ మృతి చెందితే సాధారణంగా ఉప సర్పంచ్ పాలనా పగ్గాలు చేపడతారు. కానీ ఆ గ్రామంలో ఎన్నికల సమయంలో జరిగిన జంటిల్మన్ ఒప్పందం ప్రకారం ఆ గ్రామ ఉప సర్పంచ్ మేర్నీడి వెంకటేశ్వరరావు(శ్రీను) రాజీనామా చేయగా, ఒప్పందం ప్రకారం ఉప సర్పంచ్ కావాల్సిన అల్లం తాతాజీ ఎన్నిక జరగలేదు. దీనితో ఆ గ్రామంలో ప్రస్తుతం ఉప సర్పంచ్ కూడా లేరు. అయితే పాలనా పరమైన వ్యవహారాలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. దీని ప్రభావం గ్రామంపై పడుతోంది. పంచాయతీలో నిధులు ఉన్నప్పటికీ డ్రా చేసే అవకాశం లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారి నిబంధనల ప్రకారం(జీఓ ఎంఎస్ 19) తాత్కాలిక సర్పంచ్‌ని నియమించేందుకు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు తాత్కాలిక సర్పంచ్‌ను చనిపోయిన సర్పంచ్ కామరాజు సామాజిక వర్గానికే చెందిన పంచాయతీ సభ్యుల నుంచి ఎంపిక చేయడానికి నియమించిన ప్రత్యేక అధికారులు సోమవారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించారు. వార్డు సభ్యులు మొత్తం 12 మందిలో ఈ వార్డు సభ్యుడు అల్లం వెంకటరమణ చనిపోవడంతో ఇంకా 11 మంది వార్డు సభ్యులు ఉన్నారు. నిబంధనల ప్రకారం 2/3 వంతు సభ్యుల కోరం ప్రకారం 7 గురు సభ్యులు హాజరు కావాల్సి ఉండగా 6 గురు మాత్రమే హాజరయ్యారు. నిబంధనల ప్రకారం తాత్కాలిక సర్పంచ్‌గా ఎంపికవ్వడానికి అర్హులైన ఇద్దరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన చొప్పెల్ల మంగాజీ, కాటే శ్రీనివాసులను సర్పంచ్ చేయడానికి కూటమి నాయకులు రెండు వర్గాలుగా మారి ప్రయత్నాలు చేయడంతో తాత్కాలిక సర్పంచ్ ఎంపిక జరగలేదు. చొప్పెల మంగాజీ కి మద్దతుగా వార్డు సభ్యులు కోట శ్రీనివాసరావు, అల్లం తాతాజీ, ఇళ్ల సూర్యనారాయణ(సూరిబాబు), దామిశెట్టి అనురాధ, దాకమర్రి దుర్గ, చొప్పెల్ల మంగాజీలు హాజరు కాగా, మిగిలిన వారు కూటమి రెండో వర్గం మద్దతు గైర్హాజరయ్యారు. దీనితో తాత్కాలిక సర్పంచ్ ఎంపిక వాయిదా పడినట్లు ప్రకటించి ప్రత్యేక అధికారులు రాయవరం ఈవోపీఆర్డీ ఎం.శ్రీనివాసరావు, కోట పంచాయతీ కార్యదర్శి ఎస్.రామకృష్ణ, సత్యవాడ పంచాయతీ కార్యదర్శి ఎం.సీతారామయ్యలు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

రోడ్లపై భవన నిర్మాణ వ్యర్థాలు తొలగించాలి



న్యూ కాలనీలో ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

మండపేట: రోడ్లపై ఉన్న బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్స్‌ను వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు భవన నిర్మాణ యజమానులకు సూచించారు. స్వచ్ఛ మండపేట కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. పరిసరాల పరిశుభ్రత, మెరుగైన పారిశుధ్యం ప్రధాన లక్ష్యంగా పట్టణంలో నిత్యం పర్యటిస్తున్నట్టు తెలిపారు. శానిటేషన్, మెప్మా, సచివాలయ సిబ్బందితో కలిసి 6, 10, 11 వార్డుల్లోని పర్యటించిన ఆయన ప్రజలకు పలు సూచనలు చేశారు. తడి, పొడి చెత్తలను వేరుచేయు విధానం, తడి చెత్తతో హోమ్ కంపోస్టు తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పలు కాలనీల్లో డ్రైన్లు మూసేయడం, రోడ్లపై వేసిన బిల్డింగ్ వేస్ట్ మెటీరియల్‌ను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లపై వేసిన వ్యర్థాలను తొలగించాలని హెచ్చరించారు. స్వచ్ఛ మండపేట సాధనలో భాగంగా రోడ్లపై బిల్డింగ్ వ్యర్థాలు, చెత్త వేయరాదని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, శానిటేషన్ సెక్రటరీ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

రామచంద్రపురం రూరల్: ఈ నెల 16వ తేదీన కాకినాడలో నిర్వహించిన సెకెండ్ ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో ద్రాక్షారామ విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించినట్టు సీనియర్ కరాటే మాస్టర్ బీకే రత్నం సోమవారం విలేకరులకు తెలిపారు. సీనియర్ స్పారింగ్ విభాగంలో సూర్య స్కూల్ విద్యార్థులు వి.మహేష్ కార్తిక్, పి.కిషోర్, జెడ్పీ హైస్కూల్ నుంచి ఎ.సంతోష్, స్కైలార్క్ స్కూల్ నుంచి కె.విష్ణువర్దన్‌లు మొదటి స్థానం సాధించారన్నారు. జూనియర్ స్పారింగ్ విభాగంలో సూర్య స్కూల్ విద్యార్థి డి.ఆదిత్య సాయి శ్రీవాస్, స్కైలార్స్ స్కూల్ నుంచి జి.కావ్యశ్రీ సత్య, ఎ.జయరామ్ తేజ, వెలంపాలెం సరస్వతి హైస్కూల్ నుంచి జి భాస్కర్ శ్రీ సత్యసాయి పవన్, రామచంద్రపురం భాష్యం స్కూల్ నుంచి ఎస్.ఐశ్వర్య, వాకాడ గ్రీన్‌ఫీల్డ్ స్కూల్ నుంచి వి.జానకిబృంద మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారన్నారు. జూనియర్ కాటా విభాగంలో సూర్య స్కూల్ నుంచి సీహెచ్ మోక్ష సాత్విక, గాయత్రి స్కూల్ నుంచి పి.చైతన్య శ్రీసత్య సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. కరాటే పోటీల్లో రాణించి పతకాలు సాధించిన విద్యార్థులు, వారికి శిక్షణ అందించిన కరాటే మాస్టర్ పెంద్ర బాలకృష్ణలను ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి అభినందించారని పేర్కొన్నారు.

24న వ్యవసాయ కూలీల ధర్నా

రామచంద్రపురం: ఈనెల 24వ తేదీన గుంటూరు జిల్లా తాడేపల్లి బైపాస్ ఫీడర్ రోడ్డులో గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆఫీసు ముందు ధర్నాకు వ్యవసాయ కూలీలంతా పెద్ద ఎత్తున తరలిరావాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు. స్థానిక చెలికాని రామారావు భవన్‌లో సోమవారం వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చేసిన మధు ఈనెల 24న జరిగే ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఉపాధి హామీలో 200 రోజులు పనిదినాలు కల్పించి, రోజు వేతనం రు.700 ఇవ్వాలని డిమాండ్ చేశారు. మెటీరియల్ కాంపోనెంట్‌ను ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వలసలు ఆపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఉన్న గ్రామాల్లోనే పనులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పోరాడి ఉపాధి హామీ చట్టం సాధించి కూలీలకు అందుబాటులోకి వచ్చేలా మన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ సంఘం ఉద్యమిస్తోందన్నారు. ఉపాధి హామీ పనులకోసం అధికారుల చుట్టూ తిరిగినా పనులు కల్పించడం లేదన్నారు. చేసిన పనికి నెలలు తరబడి బిల్లులు చెల్లించడం లేదన్నారు. కూలీలకు నేటికీ మన రాష్ట్రంలో చేసిన పనికి ఉపాధి హామీలో కోట్లాది రూపాయలు బకాయిలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర కోస్తా జిల్లాల్లో గ్రామాలకు, గ్రామాలే ఖాళీ అవుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాలలో టెంట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని, మజ్జిగ ప్యాకెట్లు తప్పనిసరిగా అందజేయాలన్నారు. పని ప్రదేశంలో ప్రమాదాల్లో మరణిస్తే రూ 10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. మండల స్థాయిలో వ్యవసాయ కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె రామకృష్ణ, బికెఎం యూ కన్వీనర్ పీ రాము, బాబ్జి, దివిలి రవి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వేతనాలు పెంచాలంటూ ఆందోళన



కపిలేశ్వరపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి వరాహాలక్ష్మికి వినతిపత్రం అందిస్తున్న బలరాం తదితరులు

కపిలేశ్వరపురం: క్షేత్రస్థాయిలో మాతా, శిశు సంరక్షణ కార్యక్రమాలు, సామాజిక ఆరోగ్య పరిరక్షణలో నిత్యం శ్రమించే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వం తీరుపై కన్నెర్ర చేశారు. తమ వేతనాలను రూ.26 వేలకు పెంచాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. దీనిలో భాగంగా కపిలేశ్వరపురంలోని మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన ప్లకార్డులను చేతపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.బేబి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం జీఓ తీసుకురావలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలను అర్హులుగా పరిగణించాలన్నారు. సర్వీసులో ఉండగా మృతి చెందిన అంగన్‌వాడీ కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలన్నారు. బకాయిపడిన భవనాల అద్దెలు, టీఏ బిల్లులు, వెంటనే చెల్లించాలలని, ఖాళీగా ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ ప్రతినిధికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సీహెచ్ రాజీ, సెక్టార్ నాయకులు పి.కుమారి, ఎం.జానకిదేవీ, టి.మంగాదేవి, పి.అనంతలక్ష్మి, ప్రాజెక్ట్ పరిధిలోని కపిలేశ్వరపురం, మండపేట, కె.గంగవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

రామచంద్రపురం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యల పరిష్కరించాలని, తక్షణమే గ్రాడ్యుటీ అమలు చేయాలని, పెరిగిన ధరలు అనుగుణంగా వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసు వద్ద ధర్నా చేసి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ వరాహలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి రామచంద్రాపురం ప్రాజెక్టు అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష , కార్యదర్శులు యూ వరలక్ష్మి, మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ ఏళ్ల తరబడి మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా చేయాలని పోరాటం చేస్తున్న అప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవటం లేదన్నారు. రకరకాల యాప్‌ల పేరుతో వర్కర్లపై పని భారం విపరీతంగా పెంచారని వెంటనే పనిభారాన్ని తగ్గించి యాప్‌లన్ని ఒకే యాప్‌గా తీసుకురావాలన్నారు. ప్రభుత్వం దిగివచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సమస్యల పరిష్కారం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడానికి సిద్ధపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీ వెంకటరత్నం, చంద్రకళ, జి.శ్రీదేవి కె.దుర్గ, ఐ.గోనతి దేవి, సూర్య కళ పాల్గొన్నారు.